క్లుప్తంగా

విద్యార్థినికి అభినందన



ప్రణవిని అభినందిస్తున్న జేసీ

నంద్యాల(న్యూటౌన్): డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థిని ప్రణవి అన్‌స్పోకెన్ ఫీలింగ్ పుస్తకాన్ని రచించారు. కొత్తపల్లి మండలం డిప్యూటీ తహసీల్దార్ అయిన తల్లి అరుణ, తండి రాంభూపాల్‌తో కలిసి సోమవారం ఆ విద్యార్థిని నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కలిశారు. ఆయన ప్రణవిని ప్రత్యేకంగా అభినందించి పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాగా చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

డాక్టర్ కాటసాని శివ బాలిరెడ్డికి బెస్ట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న దృశ్యం

గోస్పాడు: భారత జ్యోతి బెస్ట్ ప్రొఫెషనల్ డాక్టర్స్ అవార్డు– 2025 నంద్యాలకు చెందిన ఫిజియో, మానసిక, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ కాటసాని శివబాలిరెడ్డికి వరించింది. వైద్యవిద్య, మనో వైజ్ఞానిక శాస్త్ర, వ్యక్తిత్వ వికాస రంగాల్లో ఆయన చేసిన కృషికి గాను ముంబయికి చెందిన అంతర్జాతీయ సంస్థ ఎంపీఎల్ఏ ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం చేసింది. ఈ నేపథ్యంలో పలువురు వైద్యులు సంతోషం వ్యక్తం చేస్తూ డాక్టర్ శివబాలిరెడ్డిని అభినందనలు తెలిపారు.

నిందితుడికి ఉరి శిక్ష విధించాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

చాగలమర్రి: వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం ఎ. కంబాలదిన్నె గ్రామంలో 3 ఏళ్ల చిన్నారిని అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితుడు రహమతుల్లాను ఉరి శిక్ష విధించాలని విద్యార్థి, యువజన సఘాల నాయకులు ఓబులేసు, జయరాజు, బయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం యువజన సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ మరోసారి చిన్నారులపై అత్యాచారాలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హత్యకు గురైన బాలిక కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

పుల్లయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం



పుల్లయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: అనారోగ్యంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శెట్టివీడు గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి భర్త ఎర్రోళ్ల పుల్లయ్య (48) మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సోమవారం గ్రామానికి చేరుకొని పుల్లయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బచ్చు సుబ్రమణ్యం, మనోహర్‌రెడ్డి, బాబు, రమణారెడ్డి, షేక్ చిన్నబికారి, మహబూబ్‌బాషా తదితరులు ఉన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో సంబరం



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): బీమా పాలసీలు చేయడంలో ఎల్ఐసీ ప్రపంచ రికార్డు సాధించడంతో సోమవారం ఆసంస్థ ఉద్యోగులు, ఏజెంట్లు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డు బ్యానర్‌ను నంద్యాల బ్రాంచ్ మేనేజర్ శివశంకర్‌కుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచంలోనే ఎన్నో జీవిత బీమా సంస్థలు ఉన్నప్పటికీ ఎల్ఐసీ మాత్రమే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. సంస్థ చైర్‌పర్సన్ సిద్ధార్థ మహంతి పిలుపు మేరకు ఒకే రోజు అత్యధిక పాలసీలు చేసి అరుదైన రికార్డు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నంద్యాల బ్రాంచ్ ఉద్యోగులు రమేష్‌బాబు, నరసింహులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

యోగాను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- జిల్లాలోని ఐదు పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమం
- అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం అయ్యేలా చూడాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): సంపూర్ణ ఆరోగ్యంలో కీలక పాత్ర పోషించే యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణపై ఆమె సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, ఇందుకు ప్రణాళిక రచించుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బందిని ఇంటింటికి పంపించి యోగాపై అవగాహన కల్పించడంతోపాటు యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు యాప్‌లో నమోదు కావాలన్నారు. ఇందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు మాస్టర్ ట్రైనర్లు 130 మందికి శిక్షణ ఇచ్చారని, వీరి ద్వారా ప్రతి మండలంలో 200 మందికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న ఐదు పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 31వ తేదీన శ్రీశైలం ఆలయ ప్రాంగణంలో 1000 మందితో యోగాసనాలు చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే జూన్ 7వ తేదీన మహానందిలో, 16న నంద్యాల పట్టణంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగాంధ్రలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు యోగాకు సంబంధించిన అంశాల్లో పోటీ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

5న బనగానపల్లెలో జాబ్ మేళా

యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. వచ్చే నెల 5వ తేదీన బనగానపల్లెలో జరిగే జాబ్‌మేళాకు సంబంధించిన కరపత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 3 జాబ్ మేళాలు నిర్వహించి పలువురికి ఉపాధి చూపామన్నారు. త్వరలో బనగానపల్లెలో జరిగే మేళాకు 15 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

ముందస్తుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని అధిక వర్షాలు, ఐగాట్ కోర్సు పూర్తిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దీని వల్ల విద్యుత్ తీగలు, స్తంభాలు పడిపోవడం, మట్టి మిద్దెలు కూలిపోవడం వంటివి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఉగ్రవాదం, మతోన్మాదం విషయంలో కేంద్రం నిర్లక్ష్యం వహించరాదని, ఉక్కుపాదం మోపాలని వామపక్ష ప్రజాతంత్ర లౌకికవాదుల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మతసామరస్యం, దేశ సమగ్రతను పరిరక్షించాలని కోరుతూ సోమవారం ఆ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో సమైక్యతా యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు లక్ష్మణ్, బాబాఫక్రుద్దీన్, అబ్దుల్‌సమ్మద్, మన్నెం జానయ్య మాట్లాడుతూ గత నెల 22వ తేదీన పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని దేశ ప్రజలందరూ తీవ్రంగా ఖండించారన్నారు. అలాగే ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం తెలిపారన్నారు. సైన్యానికి బాసటగా నిలిచారని చెప్పారు. అయితే, కేంద్రం అమెరికా అధ్యక్షుడి మాటలు విని హఠాత్తుగా పాకిస్థాన్‌పై యుద్ధాన్ని ఆపివేయడం సరికాదన్నారు. దీనిపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని, ఇందుకోసం ప్రత్యేకంగా పార్లమెంట్ సెషన్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు తోటమద్దులు, గౌస్, వెంకటలింగం, మౌలాలి, జైలాన్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ చైతన్య వేదిక నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

నంద్యాల(అర్బన్): బీసీ చైతన్య వేదిక జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడు వీరపల్లి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సింధు నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు వంగా అరుణ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. ఇక నుంచి ఐక్యంగా ఉంటూ రాజకీయంగా ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఇంటి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా వెంకటాద్రి, మండ్ల గంగాధర్, నవీన్, ప్రధాన కార్యదర్శిగా చల్లా మద్దిలేటి, కార్యదర్శిగా రామకృష్ణ, బాలమద్దిరాజు, నంద్యాల పట్టణ అధ్యక్షుడిగా రెడ్డిచర్ల ప్రసాదరాజును ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ చైతన్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగించడం తగదు



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న పరిశ్రమలో పని చేసే కార్మికులను తొలగించడం అన్యాయమని ఏఐటీయూసీ నంద్యాల పట్టణ అధ్యక్షుడు భూమిని శ్రీనివాసులు అన్నారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్ ఎదుట ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలగించిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున కార్మిక సంఘాలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పరిశ్రమను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, సోమన్న పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



అవగాహన కల్పిస్తున్న మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి

శిరివెళ్ల: వర్షాకాలంలో దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలల్లో దోమల వ్యాప్తి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వేసవి సెలవులలో ప్రభుత్వ వసతి గృహాల్లో ఐఆర్ఎస్ ద్రావణాన్ని పిచికారీ చేస్తామన్నారు. దోమలు ఆహారం తీసుకున్న తర్వాత గది గోడలు, సీలింగ్, పర్నీచర్, తలుపుల వెనుక భాగంలో దోమలు వాలుతాయన్నారు. ఇంటి బయట దోమల నివారణకు ప్రైడే డ్రైడే పాటిస్తున్నామన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమన్న

నంద్యాల(న్యూటౌన్): కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందని, పంటల వారీగా ప్రణాళికలు, ఇంత వరకు ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. సబ్సిడీ విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 90 శాతం కౌలు రైతులే వ్యవసాయంపై చేస్తున్నారన్నారు. అన్ని రకాల విత్తనాల ధరలు పెరిగిపోయాయని, దీంతో బయటి మార్కెట్లో నాణ్యత లేని విత్తనాలను విచ్చలవిడిగా అమ్ముతున్నారన్నారు. కల్తీ విత్తనాలు అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు కూటమి ప్రభుత్వం ఏ పథకాన్ని అమలు చేయలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం నాయకులు జిలానీ, బాలుడు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తజనసందడి



మహానందీశ్వరస్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో సోమవారం భక్తులరద్దీ నెలకొంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, శీఘ్రదర్శనం తదితర ఆర్జిత సేవా టికెట్ల ద్వారా భక్తులు గంటల తరబడి వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా వర్షం వల్ల పల్లకీసేవ కార్యక్రమం రద్దు చేసినట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

ఆధార్‌కు అనుసంధానం చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఆధార్‌కు పోస్టల్ బ్యాంక్ అకౌంట్ ను అనుసంధానం, ఎన్‌పీసీ లింకేజ్ చేసుకోవాలని డివిజన్ సూపరింటెండెంట్ రాజేష్ ఖాతాదారులకు సూచించారు. సోమవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ . చాలా మంది అకౌంట్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసుకోలేదన్నారు. ప్రస్తుతం పోస్టల్ డిపార్ట్‌మెంట్ సీడింగ్ కార్యక్రమం చేపట్టిందని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రూ.లక్ష వితరణ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు, పారిశ్రామికవేత్త ఆత్మకూరు సుదర్శనం శెట్టి తన మనవడి వివాహాన్ని పురస్కరించుకుని సోమవారం లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సీనియర్ నాయకులు డాక్టర్ సహదేవుడు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ఆత్మకూరు సుదర్శనం శెట్టి పలు సేవా కార్యక్రమాలకు సహకారం అందించారని కొనియాడారు. లయన్స్‌క్లబ్ తరపున ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ పరీక్షకు 503 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన సోషల్ పరీక్షకు 503 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని 35 పరీక్ష కేంద్రాల్లో 1599 మంది విద్యార్థులకు గాను 1096 మంది హాజరయ్యారన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

విధుల్లో చేరుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

గోస్పాడు: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు విధులు చేరుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య తెలిపారు. సోమవారం నంద్యాల పట్టణంలోని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ కలిసి వారు చేస్తున్న నిరవధిక సమ్మెను విరమిస్తున్నట్లు తెలిపారు. తిరిగి విధుల్లో చేరుతున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓకు లేఖ అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల యూనియన్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, సెక్రటరీ గురుప్రసాద్, అఖిల్, భార్గవ్, హారిక, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు శ్రీనివాసులు, హాజీవలి, వినోద్ కుమార్, సాయిరాం నాయక్ పాల్గొన్నారు.

ఉమామహేశ్వరునికి ప్రత్యేక పూజలు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఏకశిలా రూపంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

సాంకేతిక లోపాలను సవరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఆన్‌లైన్ బదిలీల్లో ఏర్పడిన సాంకేతిక లోపాలను వెంటనే సరిచేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, అజాంబేగ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో బదిలీల దరఖాస్తుకు కంప్యూటర్ సెంటర్లలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందన్నారు. గత ఐదురోజులుగా ఈ సమస్య వేధిస్తోందని, సమస్య పరిష్కారంలో కూటమి ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు చెన్నకేశవులు, సుబ్బయ్య, పురుషోత్తమరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్, బసవరాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



వానకు చిత్తడిగా మారిన రుద్రవరం సంత మార్కెట్

కుండపోత వర్షం



క్రిష్టిపాడులో జలమయమైన వీధి

దొర్నిపాడు/రుద్రవరం: ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు మండలాల్లో సోమవారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రుద్రవరం, దొర్నిపాడు మండలాల్లో కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. చేతికి వచ్చిన మినుము పంట తడిసిముద్దయింది. మండలకేంద్రంలోని రుద్రవరం సంతమార్కెట్ వర్షానికి చిత్తడిగా మారడంతో వినియోగదారులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఖరీఫ్‌కు సిద్ధం చేసుకున్న పంటపొలాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానకు గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి బీళ్లుగా మారుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదల సేవే లక్ష్యం



రుణాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి

బొమ్మలసత్రం: శిల్పాసేవా సమితి ద్వారా నియోజకవర్గంలో పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక శిల్పా సేవా సమితి కార్యాలయంలో శిల్పా మహిళా బ్యాంక్ ద్వారా రుణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత 15 ఏళ్లుగా శిల్పా సేవా సమితి ద్వారా పేద ప్రజల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మహిళలు స్వయం ఉపాధిలో రాణించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను కొనసాగించామన్నారు. ఇందులో దాదాపు 8 వేలకు పైగా మంది మహిళలు శిక్షణపొంది స్వయం ఉపాధి కల్పించుకున్నారన్నారు. రుణాలు పొందిన మహిళలు తిరిగి బ్యాంక్‌కు సక్రమంగా చెల్లించడం అభినందనీయమన్నారు. రాజకీయాలకు సంబంధం లేకుండా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నామని చెప్పారు. అనంతరం 180 మంది పేద మహిళలకు బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీకి రూ. 26.20 లక్షల రుణం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, కౌన్సిలర్ చంద్రశేఖర్, నాయకులు శ్రీరాములు, మాబాషా, శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



చాగలమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈతో చర్చిస్తున్న ఈఈ శ్రీనివాసులు రెడ్డి

చాగలమర్రి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఈఈ (ఆపరేషన్స్) జి.శ్రీనివాసులురెడ్డి సూచించారు. సోమవారం చాగలమర్రిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా, బిల్లుల వసూలు తదితర అంశాలపై ఇన్‌చార్జి ఏఈ రమణయ్యను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఈఈ మాట్లాడుతూ నంద్యాల డివిజన్ పరిధిలోని ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, నంద్యాల అర్బన్, రూరల్ సబ్‌డివిజన్లలో ఏపీఎస్‌పీడీసీఎల్‌కు విద్యుత్ బిల్లుల రూపంలో రూ.28 కోట్లు వసూలవుతున్నట్లు తెలిపారు. సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్ల ఏర్పాటుకు నంద్యాల డివిజనల్‌లో ఇప్పటి వరకు ఎస్సీ,ఎస్టీల నుంచి సుమారు 16,658 దరఖాస్తులు, ఓసీల నుంచి 2,397 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. 3 కిలో వాట్ల కెపాసిటీ గల సోలార్ యూనిట్‌కు ప్రభుత్వం రూ.78,000 సబ్సిడీ మంజూరు చేస్తుందని వెల్లడించారు. చాగమర్రిలో వ్యవసాయ బోరు మోటార్లకు సంబంధించి 10 ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు అయ్యాయన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



రామచంద్రమిషన్‌లో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్)/(అర్బన్): పట్టణంలోని క్రాంతినగర్‌లో ఉన్న శ్రీ రామచంద్రమిషన్‌లో 1 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. యోగా మాస్టర్ ఆశా మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి రోజు గంటపాటు యోగా చేయాలన్నారు. వలంటీర్ల ద్వారా వివిధ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. శ్రీరామచంద్ర మిషన్ మేనేజర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొని యోగా కార్యక్రమాలు వివరించారు.

- యోగాను ప్రతి రోజు దినచర్యలో భాగం చేసుకోవాలని జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి శ్రీహరి గోపాల్ పేర్కొన్నారు. సోమవారం గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో యోగా గురువులు శ్రీనివాసరావు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సారూ..మా గోడు పట్టించుకోండి



తహసీల్దార్ శ్రీనివాసులుకు సమస్యలు విన్నవిస్తున్న వివిధ గ్రామాల ప్రజలు

ఉయ్యాలవాడ : తమ సమస్యలు పట్టించుకోవాలని వివిధ గ్రామాల ప్రజలు అధికారులను మొరపెట్టుకుంటున్నారు. సోమవారం ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. 175-2లో 35 సెంట్లు, 180-1లో 18.5 సెంట్ల భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని ఆర్. జంబులదిన్నె గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి అర్జీ ఇచ్చారు. ఏడాది నుంచి గ్రామ సచివాలయం, రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయాడు. కొత్త రేషన్ కార్డులో పిల్లల పేర్లు నమోదు కాలేదని ఆర్.పాంపల్లె గ్రామానికి చెందిన గోపాల్, వికలాంగ పింఛన్ రూ. 6 వేలు ఇప్పించాలని సుద్దమల్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఓబుళపతి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అర్జీలను పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ హరికృష్ణ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఫణీత్‌క్రిష్ణ, వెంకటయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.